16032025-DIS-06_Layout 1 3/16/2025 4:19 AM Page 1



'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com



## స్వప్నమేనా సాధికారత?

బ్యాక్‌వర్డ్ క్లాస్
ఆంగ్లంలో అందాన్నిచ్చింది
వెనుకబడిన తరగతులు తెలుగులో
మరీ అందాన్నిచ్చింది
రాయడానికి మీకేమి సిగ్గనిపించటం లేదా
వెనుకబాటు పదాన్ని రాస్తున్నామంటే
రాజ్యాంగానికి వృద్ధాప్యం వచ్చిందా?
పాలకులుగా మీరు ఎంత అణచివేశారో
అర్థమవుతుంది!

చెరువు మట్టి తెచ్చి చేతుల్లో పిసికి
సారె మీద మట్టి
కళాఖండాలకు పోతపోసి
ఆదినుంచి సేవలందించిన
శాలివాహనులకు
మీరిచ్చిన బిరుదు వెనుకబడినోడు

వైద్యుల దగ్గరకు అనుమతులు
వేల రూపాయల ఫీజులు
శరీర పరీక్షలు, మందుల
దుకాణంలో కమీషన్లు
దేశానికేదో సేవలు చేసినట్టు
పద్మశ్రీ అవార్డులు

వెనుకబడిన కులగణన
అంటేనే గుబుళ్లు
బీసీలకు హామీలు
తీర్పులు దిండు కింద పాములు
వృత్తేదేదైనా
సమాజానికి అంకితమై నడిచారు
సంచార కళలతో సైనికులై
కవాతులు చేశారు
సబ్బండ వర్ణాలే దేశానికి వెన్నెముకలు

ఊరును దేశాన్ని నిర్మించాం
నీళ్లకై ప్రాజెక్టులు నిర్మిస్తూ బలయ్యాం
ఇటుకలను పేర్చి బహుళ అంతస్తులుగా
అసెంబ్లీ, పార్లమెంట్ భవనాలు కట్టాం
స్వేచ్ఛా సమానత్వం, సౌభ్రాతృత్వం
సామాజిక న్యాయమంటూ
ప్రతిజ్ఞ చేసి చట్టాలకు పురుడుపోశాం
కానీ
అందులోకి ప్రవేశం లేకుండా
సామెతలతో సంస్కృతాధిపత్యాలతో
హీనపరుస్తూ
అవమానాలు, అవహేళనలు

అంబరపు చినుకులు
విత్తనాలకు తడులు
వికాసపు ఝరులు
చలికి వెచ్చని గొంగడి
అలిసిన తనువుకు ఈతకల్లు
పంట కంకులకు కొడవలై
నూతన గృహానికి గుండు దారమై
పార, తట్టె వంటికి తెలుపై
నునుపై సుందరమై
బాసింగాలు మంగళ సూత్రాలు
నల్లపూసలు కాళ్ల కడియాలు
నగల అలంకరణలతో కులుకుతున్నారు

నాగళ్లను చెక్కిన పెద్ద బాడిస
పని ముట్లను పొదిగిన కొలిమి
సోకులు చేసుకోలేదెన్నడు
ఈత సాపలల్లిన చేతులు
మగ్గాలు నేసిన చేనేతలు
సన్నాయి వాయించిన చేతులు
డమరుకం ఆడించిన చేతులు
శంఖులూదిన కాటికాపరులు
తంబురాలను పలికించిన రాగాలు
పొందలేదు గౌరవాలు
మా సేవలు రాయబడని మహాకావ్యం!

పంచనామాలు జరగాలి
పోస్టుమార్టం చేయాలి
పార్టీలిచ్చేది భిక్షం
చట్టం మా హక్కు
బహుజన సేవలు వృథా అయితే
భారతమ్మ గుండెకు గాయాలు
ఉదయం ఉదయించటం మానేసినట్టే!
హరితవర్ణమైన పత్రహరితమైనా
బహుజనుల ఘర్మ జలమే

వీధుల్లో దిమ్మెలమై
మీ జెండాలను భుజాన మోస్తున్నాం
జేజేలు కొట్టి స్వాగతాలు
పలికేది మేమే ఓట్లేసేది మేమే
కానీ, పాలకులయ్యేది మీరు
మీ రాక కోసం వసంతకేళీలు ఆడాం
ఎన్నేళ్లీ గ్రహణాలు
ఎన్నేళ్ళు అమవాస్య పాలన
కావాలి బహుజన పున్నమి

సప్తనదుల సంగమంలా
పంచభూతాల కలయికలా
బీసీలకు అధికారాలు కావాలి
అగ్రవర్ణాల కుటిల నీతిలో
స్వప్న సింహాసనాలేనా?

(అసెంబ్లీలో బీసీ బిల్లు డిమాండ్‌కు....)



వనపట్ల సుబ్బయ్య
94927 65358

# భాషే కదా వ్యక్తిత్వ దర్పణం!



కనకదుర్గ దంటు

**ప్రపంచంలో రకరకాల మనుషులుంటారన్నది అందరికీ అనుభవమే! అయితే, మామూలు వాళ్లను వదిలేస్తే, రెండురకాల మనుషుల గురించి అందరూ మాట్లాడుకుంటారు. చాలా సంస్కారవంతులు, పూర్తిగా సంస్కారహీనులు. వీరిద్దరు కూడా పక్కవారిని ఎప్పటికప్పుడు ఆశ్చర్యానికి గురిచేస్తూనే ఉంటారు. మొదటిరకం మనుషులు తమ స్నేహశీలత్వంతో, తమ ఆహ్లాదకరమైన మాటలతో, ఇతరుల పట్ల ఉన్న ఆదరం, గౌరవం తమ ప్రవర్తనలో ప్రకటిస్తూ అందరికీ ఇష్టులవుతారు. ఇంక రెండోరకం మనుష్యులు తమ కరకు మాటలతో శత్రువుల్లాగా ప్రవర్తిస్తూ సామాన్యుడు కూడా అసహ్యించుకునే పరిస్థితి తెచ్చుకుంటారు.**



నిజానికి సామాన్యుల కంటే నాయకులనే వారికి ఉత్తమ వ్యక్తిత్వం ఉండాలి. అప్పుడే వారు ప్రజలను సరైన రీతిలో నడపగలుగుతారు. మరి ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి పదవిని సంపాదించిన వారు (అది ఎట్లా సంపాదించారో అందరికీ తెలియకపోవచ్చు) ఎలా ఉండాలి? ఎంత సంస్కారవంతమైన వ్యక్తిత్వం, శుద్ధమైన వాక్కు ఉండాలి? పక్కవారిని గౌరవించే అలవాటు లేకపోయినా, తను సంపాదించిన స్థాయినైనా గౌరవించాలి కదా! మరి అలా లేకపోతే ఆయనను ప్రజలు ఎలా అర్థం చేసుకోవాలి? ఆ పదవికి కూడా కళంకం ఆపాదిస్తున్న ఆ ముఖ్యమంత్రిని ఇంకా భరించాలా? ఈ విషయం సామాన్య ప్రజలే కాక, ఆయన సహచరులు, వారికి ఈ పదవిని కట్టబెట్టిన పార్టీ పెద్దలు నిశితంగా ఆలోచించవలసిన సమయం వచ్చింది.

ఒక భాష అనేది దానిలోని సామెతలు, జాతీయాలను బట్టి గొప్పదని తెలుస్తుంది. మరి మన తెలుగులో ఈ పరిస్థితిని వర్ణించగలిగిన సామెతలున్నాయా చూద్దాం!

'కనకపు సింహాసనమున
శునకము గూర్చుండ బెట్టి శుభలగ్నమునం
దొనరగ బట్టము గట్టిన
వెనుకటి గుణ మేల మాను వినరా సుమతీ!'

దీని అర్థం ఇది. ఒక శుభ ముహూర్తాన కుక్కనొక దానిని తెచ్చి బంగారు సింహాసనం మీద కూర్చోబెట్టి, శాస్త్రోక్తంగా దానికి పట్టాభిషేకం చేసినా, దాని గుణాలు, ప్రవర్తన మారుతాయా? అలాగే ఒక నీచుడిని అందరూ గౌరవంగా చూసినా వాడు నీచ గుణాన్ని వదులుకుంటాడా? వదులుకోడు. ఎప్పటికీ అలాగే ఉంటాడు. ఇంకొక పద్యం కూడా బాగుటుంది.

"ఎలుకతోలు తెచ్చి ఏడాది ఉతికినా
నలుపు నలుపే కానీ తెలుపు కాదు,
కొయ్యబొమ్మదెచ్చి కొట్టినా బలుకునా?
విశ్వదాభిరామ వినురవేమ!"

దీని అర్థం చెప్పక్కరలేదు కదా! చాలా తేలిక పద్యం ఇది. ఇంకొకటి ఇప్పటి మనస్తత్వానికి సరిగ్గా సరిపోతుంది.

'తివిరి యిసుమున తైలంబు తీయవచ్చు,
దవిలి మృగతృష్ణలో నీరు ద్రావవచ్చు
తిరిగి కుందేటి కొమ్ము సాధించవచ్చు!
చేరి మూర్ఖుల మనసు రంజింపరాదు'
– భర్తృహరి.

చాలా ప్రయత్నం చేస్తే ఒక్కటి తప్ప కష్టమైనవేమైనా సాధించవచ్చు. ఇసుక నుంచి నూనె తియ్యొచ్చు, ఎండమావులలోని నీరు త్రాగవచ్చు; సృష్టిలో కుందేటికి కొమ్ములు లేకపోయినా, ఏ భగవంతుడికో తపస్సు చేసి అది కూడా సంపాదించవచ్చు. మస్తిష్కం నిండా మూర్ఖత్వం మాత్రమే ఉన్నవాడిని ఎన్నటికీ ఒక్క అణు లేశం కూడా ఎవరూ మార్చలేరు, వాడు మారలేడు, మారడు. ఇది పై పద్యం అర్థం.

ఇప్పుడు నిజ జీవితంలో మన రాష్ట్రంలో చూస్తున్న దృశ్యం వల్ల ఈ మహానుభావుల పద్యాలన్నీ గుర్తొస్తున్నాయి. ఎంత నిజాలు దాగున్నాయి ఈ పద్యాలలో! కేసీఆర్ 2024 డిసెంబర్‌లో ఎన్నికలలో గెలిచి ముఖ్యమంత్రైన వ్యక్తికి సమయమిచ్చి చూడాలని ఒక ఏడాది పాటు మౌనం పాటిస్తే, ఆ ఏడాది ప్రజలంతా ఒక్కొక్క నెలలో కొన్ని కొత్త తిట్లు, శాపనార్థాలు నేర్చుకోగలిగారు. మరి తెలుగులో ఇన్ని వాడేసిన వారికి ఒక్క సలహా ఇవ్వవచ్చు. భమిడిపాటి కామేశ్వరరావు అనే రచయిత 'సిమాలమ్మ' అనే కథలో (కథ పెద్దదే లెండి) తెలుగులో ఉన్న తిట్లన్నీ రాశారు. సిమాలమ్మ అన్న ఒక వృద్ధురాలు పొద్దున్నే బయల్దేరి ఊరంతా చుట్టివస్తూ ఒక్కొక్కళ్లని తిట్టే తిట్లన్ని ఉంటాయి అందులో.

ముఖ్యమంత్రి కార్యాలయం వారు తమ నాయకుడికి కొత్త పదాలిచ్చి సహాయం చెయ్యాలనుకుంటే, బహుశా రాజమండ్రిలో గానీ, విజయవాడలో గానీ ఆ పుస్తకం దొరకవచ్చు. అది తెప్పిస్తే మిగతా నాలుగేండ్లు కూడా పాలన జోలికి పోకుండా మన ముఖ్యమంత్రికి కాలక్షేపమవుతుంది.

ప్రజలందరూ ఒక్క విషయం గుర్తు పెట్టుకోవాలి. సృష్టికర్త జంతువులన్నింటికీ ఒక్కొక్క రకమైన ఆయుధాన్ని వాటి శరీరం మీదే అమర్చాడు. కానీ, మనిషికి ఆయన ఇచ్చిన వరం భాష. దానిని దుర్వినియోగం చేసినా, అనుచితంగా ఉపయోగించినా అది వాడిన వారి మీదికే ఆయుధమై తిరగబడుతుంది. శిశుపాలుడి వంద తిట్లు కృష్ణుడి చక్రంలో వెయ్యి ములుకులై శిశుపాలుడిని అంతం చేశాయి. త్రికరణ శుద్ధి–మనిషికి ఉండాల్సిన లక్షణం. దీనిలో మంచి ఆలోచన, ఆహ్లాదకరమైన భాష, ఆచరణాత్మక లక్షణం ఉండాలి.

---

**ఏ వ్యక్తి ప్రతిభకైనా గీటురాయి అతని పనితనమే అవుతుంది. పాలకుడికీ ఇది వర్తిస్తుంది. సామాన్యుడికి తన ప్రతిభను చాటుకునే అవకాశాలు చాలా పరిమితంగా వస్తాయి. కానీ, పాలకుడి విషయంలో అద్భుతాలు ఆవిష్కరించే అవకాశం ఎల్లప్పుడూ అతని చేతుల్లో, చేతల్లోనే ఉంటుంది. అదేం దౌర్భాగ్యమో కానీ, అప్పనంగా వచ్చిన అవకాశాన్ని వెకిలి మాటలతో దుర్వినియోగం చేస్తున్న దృశ్యం మన రాష్ట్రంలో పూటపూటకూ ఆవిష్కృతమవుతున్నది. తన చేతుల్లో ఏదీ లేదనీ, అస్సలేం చేతకావడం లేదనీ, చేవగారిపోయిన ఆ నేత.. తన తప్పిదాలను కప్పిపుచ్చుకునేందుకు చచ్చు మాటలు, పుచ్చు మాటలు పేలుతున్నాడు.**

# దుష్టం దూరేణ వర్జయేత్



పదవిని బట్టి స్టేచర్ సారీ స్టేచర్ వస్తుందని వక్రభాష్యాలు చెప్పినవాళ్లకు.. నోరు పారేసుకుంటే కలిగే అనర్థాలు తెలియకపోదు. కానీ, వాచాలురుగా ప్రసిద్ధి చెందిన వారినుంచి ఇలాంటి అవాకులూ–చవాకులూ మినహా అర్థవంతమైన, గంభీరమైన పదాలు దొర్లుతాయనుకోవడం మన అమాయకత్వం. పురాణాలు పరికిస్తే... ఇలా నోటికి పని చెప్పి కూటికి లేకుండాపోయిన పాత్రలెన్నో కనిపిస్తాయి. చిన్నా పెద్దా తేడా లేకుండా అహంకారంతో హూంకరించిన మదగజాలు కూడా మట్టికరిచాయి. త్రేతాయుగంలో వాచాలత్వానికి ప్రతీకగా వానరరాజు వాలి కనిపిస్తాడు. తన సోదరుడైన సుగ్రీవుణ్ని నిందించి, మోసగించి దుష్టుడిగా మిగిలిపోయాడు. రావణుడి కుమారుడు ఇంద్రజిత్‌దీ అదే వైఖరి. మంచి చెప్పిన విభీషణుణ్ని పినతండ్రి అని కూడా చూడకుండా వ్యర్థ వ్యాఖ్యలు పేలి.. దుష్ట చరిత్రను మూటగట్టుకున్నాడు. అంతటి రావణుడు కూడా సీతమ్మ ముందు పొల్లుమాటలు ఏకరువు పెట్టి నికృష్టుడిగా మిగిలిపోయాడు. యుగయుగానా ఇలాంటి దుష్టబుద్ధులు కొల్లలుగా కనిపిస్తారు. ద్వాపర యుగానికి వస్తే.. శిశుపాలుడిదీ వాచాల గోత్రమే! వసుదేవుడిని తూలనాడి తల తెగిపడేదాకా తెచ్చుకున్నాడు. కంసుడు, నరకుడు, శకుని తదితరులంతా దుష్టులుగా చెలామణి కావడానికి వారి నోరు అదుపులో లేకపోవడమే ప్రధాన కారణం.

**ప్రస్తుతానికి వస్తే.. ఎన్నికల ప్రచారంలో మాటలు కోటలు దాటడం సహజం. వైరిపక్షాల మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణలు సర్వ సాధారణం. అబద్ధాలు కుమ్మరించి.. అందలమెక్కిన వాళ్లు, నేటికీ అదే పంథాను అనుసరిస్తుండటం విడ్డూరం. ఇప్పుడున్న కరెంటు కోతలపై పెగలని నోరు.. తెలంగాణ రైతాంగానికి 24 గంటలు ఉచిత కరెంటు ఇచ్చిన నేతపై పాడు కూతలు కూస్తున్నది. అరవై ఏండ్ల అరిగోసను తప్పించి, ప్రత్యేక రాష్ట్రాన్ని సిద్ధింపజేసి, వచ్చిన తెలంగాణను ఒడ్డున నిలిపిన దార్శనికుడిని కీర్తించకపోగా.. వారి కీడు కోరుకోవడం పాడు రాజకీయం కాక మరేమిటి? విద్యార్థుల సభలో అవే తిట్లు, ఉద్యోగుల భేటీలో అంతకన్నా నీచమైన శాపనార్థాలు! వేదిక ఏదైనా అసందర్భ ప్రేలాపనలతో తాను ఎలాంటి వాడినో రుజువు చేసుకునేందుకు ఆయన ఎందుకు అంత తాపత్రయపడుతున్నాడో అందరికీ తెలిసిందే!**

పల్లెకు పోతే అన్నదాత నిలదీస్తడు. 'కేసీఆర్ ఇచ్చిన రైతుబంధు ఎందుకు ఇస్తలేవని'! మహిళలను పలకరిస్తే.. మహాలక్ష్మి బకాయిలు అడుగుతరని జంకు. సొంత ఇలాఖాలో తిరుగుదామంటే.. 'లగచర్ల లడాయి ఇంకా పచ్చిగానే ఉంది'! పెద్దల ఆశీర్వాదం తీసుకుందామంటే... పెంచుతానన్న పింఛన్ అడుగుతరని గుబులు. పోనీ ఢిల్లీ పెద్దల మన్ననలున్నంత కాలం ఫికర్ లేదు అనుకుందామంటే.. ఆ పరిస్థితీ లేదు! ఎక్కడికి వెళ్తే ఎవరు నిలదీస్తారో అన్న భయం కొద్దీ ఆయన ఎంచుకున్న విధానం పరనింద. నోటికొచ్చినట్టు తిట్టడమే పనిగా పెట్టుకున్నాడు! ఇలా ఇష్టారీతిగా నోరు పారేసుకుంటూ ఉంటే.. తనను ఎవరూ ప్రశ్నించే సాహసం చేయరని సదరు పాలకుడి ఉబలాటం కావొచ్చు. 'దుష్టుడికి బహుదూరంగా ఉండాల'న్న పెద్దల మాటను అనుసరించి.. ప్రతిపక్షాలే కాదు, ప్రజలు కూడా తనను నిలదీయలేరనీ, తనకు దూరంగా ఉంటారని భావిస్తున్నట్టున్నాడు. కానీ, పురాణ కాలం నుంచి దుష్టులకు దక్కిన గౌరవమే.. ప్రజాక్షేత్రంలో ఇతగాడూ పొందడం, దక్కడం ఖాయం. ఆయన అనుకున్నట్టే.. సమాజం దుష్టుడికి దూరంగా ఉంటుంది. కానీ, అవకాశం వచ్చినప్పుడు అదే సమాజం దుష్టుడిని ఆమడ దూరం పెడుతుంది.


– కణ్వస

---

# పౌర సమాజమా.. ఇప్పుడేమంటావ్?

**ప్రతివారినీ ఆత్మవిమర్శ చేసుకోవాలని డిమాండ్ చేసే తెలంగాణ 'పౌర సమాజం' ఇప్పుడు తానే ఒకసారి ఆత్మవిమర్శ చేసుకోవాలేమో! ఒక పౌర సమూహంగా తెలంగాణ ఎక్కడో ఒకచోట ఒక ఫైన్ బ్యాలెన్స్ కోల్పోయినట్టు మాత్రం గత ఏడాదిగా స్పష్టంగా కనిపిస్తున్నది. ఎలాగో ప్రతి అంశాన్ని కేసీఆర్ ప్రభుత్వంతో పోల్చటం ఇష్టం కాబట్టి, వివిధ అంశాల పట్ల మార్పు తర్వాత, మార్పు ముందు వారి వైఖరిని కూడా పోల్చుకుంటే, పరిశీలించుకుంటే బాగుంటుందేమో.**

కేసీఆర్ ప్రభుత్వ పనితీరును ప్రశ్నించడానికి అనేక ప్రశ్నించే గొంతుకలు ఏ పారామీటర్స్ ఐతే నిర్మించుకున్నాయో, అవే ప్రమాణాలను ఇప్పుడున్న ప్రభుత్వానికి వర్తింపజేస్తున్నారా? 'సరే, రాజకీయాలు స్తబ్ధంగా ఉండవు, వేర్వేరు కారణాల వల్ల ఒక పార్టీకి అంతో ఇంతో మద్దతుగా, లేదా ఒక భావజాలానికి మద్దతుగా నిలబడవలసి వస్తుంది.' కనీసం ఇటువంటి వివరణ అయినా ఇవ్వాలి కదా? ఒకవేళ ఇటువంటి వైఖరి తీసుకున్నా కూడా కాస్త నర్మగర్భితంగా కూడా ఉండొచ్చు. అయినా, పౌర సమాజానికి మన సొసైటీలో ముఖ్యమైన స్పేస్ ఉన్నది. ఇందుకు కారణం వారొక ప్రజాస్వామిక దృక్పథంతో ప్రజల శ్రేయస్సు, ఆకాంక్షల గురించి ఆలోచిస్తారు, కోరుకుంటారు. అందుకోసం అవసరమైతే ప్రభుత్వాలను ప్రశ్నిస్తారు కాబట్టి. తెలంగాణ సాధనలో, నిర్మాణంలో, ప్రజాస్వామ్య పరిరక్షణలో, పౌర హక్కుల విషయంలో ఇప్పటిదాక మన పౌర సమాజం సాధించిన విజయాలు అన్నీ ఇన్నీ కావు. కానీ, ఇప్పుడున్న నేపథ్యంలో మాత్రం, వ్యక్తిగత ద్వేషం, కక్షపూరితమైన ధోరణే వారి వైఖరిని డిఫైన్ చేస్తున్నట్టు అనిపిస్తుంది. వారు ప్రదర్శించే వైఖరికి ఇంకొక కారణం కూడా ఉండొచ్చు.



వారు ఏరి కోరి తెచ్చుకున్న ప్రభుత్వమే అతి తక్కువ సమయంలో ఇంత దివాలాకోరుతనం ప్రదర్శిస్తున్నప్పుడు, నిరాశా నిస్పృహలకు గురైే ప్రజలకు వారి జవాబుదారీతనాన్ని దాటవేయడానికి, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యం చెందినప్పుడల్లా దాన్ని గత బీఆర్ఎస్ ప్రభుత్వానికి కూడా ఆపాదించడం తప్ప వారు చేయగలిగింది ఇంకేముంటుంది? నిజానికి ఇదొక ఆత్మ సమర్థన వైఖరి. ఇటువంటి వైఖరి వారి పక్షపాత ధోరణికి నిదర్శనం. ప్రతిపక్షంగా ఉన్న పార్టీకి ప్రభుత్వంలో ఉండే పార్టీని ప్రశ్నించే నైతిక హక్కు లేదనటం వారి మేధో సంక్షోభానికి ప్రతిబింబం. గత పదేండ్లుగా వీరే కదా ఒక బలమైన ప్రతిపక్షం ఉంటే రాజకీయ వ్యవస్థ మెరుగ్గా ఉంటుందన్నది! ప్రభుత్వ ఒంటెత్తు పోకడలకు పొలిటికల్ కౌంటర్ నెరేటివ్‌ను ప్రతిపక్షమే ఇవ్వగలుగుతుందని పదేపదే చెప్పారు కదా? ఇప్పుడేమో ప్రతిపక్షానికి మాట్లాడే నైతిక హక్కే లేదనటం హేతుబద్ధమేనా?, అసలు అది ప్రజాస్వామ్య దృక్పథమేనా?

ఇదే లాజిక్ జాతీయ రాజకీయాలకు వర్తిస్తే, కాంగ్రెస్‌కు ఈ దేశంలో, ఏ ఒక్క రాష్ట్రంలోనైనా ప్రశ్నించే నైతిక హక్కుంటుందా? దేశంలో బీజేపీకి అనుకూలంగా ఉన్న కొంతమంది బీజేపీని ప్రశ్నించినప్పుడల్లా నెహ్రూను, లేదా కాంగ్రెస్ పార్టీ 60 ఏళ్లలో చేసిన అఘాయిత్యాలను ఎలాగైతే ఎత్తిచూపించి వారి ప్రభుత్వ మనుగడను సమర్థించుకుంటారో, 'చైతన్యవంతమైన మన పౌర సమాజం' కూడా అదే మోడల్‌ను ఫాలో అయితే ఎలా? అధికారంలో ఉన్నదా! లేదా! అన్నదానితో సంబంధం లేకుండా, ప్రతిపక్షంలో ఉన్న పార్టీని పదే పదే టార్గెట్ చేస్తుంటే, అది అహంకారం, కక్ష అవుతుంది. అదే అధికారంలో ఉన్నవారితో చేస్తే అది ప్రజల కోసం పోరాటం అవుతుంది, ప్రజాస్వామ్య స్ఫూర్తిని కాపాడటమవుతుంది. మన మహా మేధావులకు ఈ మౌలికమైన సూత్రం అర్థం కాకపోతే తెలంగాణ రాష్ట్రానికి, ప్రజలకు హాని కలగక తప్పదు.

పౌర సమాజం పేరుతో 1980ల నుంచి అవలంబించిన సంకుచితమైన ఆలోచనల వల్ల, అహంకారం వల్ల, ఎలక్టోరల్ పాలిటిక్స్, రాజకీయ వ్యవస్థలో ఉన్న స్పేస్‌ను కాంప్రమైజ్ చేసుకున్నారు. ఇప్పుడు మన రాష్ట్రంలో బీజేపీ అనే భూతం కాచుకుని కూర్చుని, ఎదుగుదలకు ఎదురు చూస్తున్న సమయంలో రెండు జాతీయ పార్టీలు కలిసి తెలంగాణ ప్రజల అస్తిత్వంలో పునాదులున్న ప్రాంతీయ పార్టీని ఖతం చేద్దాం అనుకుంటున్న నేపథ్యంలో, తెలంగాణ మేధావులు, తెలంగాణ పౌర సమాజం అనధికారికంగా ప్రభుత్వ పర్సెప్షన్ సేవకులుగా, తమ వైఖరిని ప్రదర్శించుకోవటం హాస్యాస్పదం, స్వయంకృతాపరాధం!

**(పౌర సమాజపు మేధావుల తీరు తెన్నులపై సంపూర్ణ వామపక్ష భావజాలం నుంచి వచ్చిన ఒక యువ మిత్రుడి ప్రతి స్పందన ఇది..)**

---



గౌరవ శాసనసభకు
## విన్నపం

# పెండింగ్ బిల్లులు చెల్లించాలి

**తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో గ్రామ పంచాయతీలు పట్టణాలకు దీటుగా అభివృద్ధి సాధించాయి. దేశంలో 20 పంచాయతీలను ఆదర్శ పంచాయతీలుగా ఎంపికచేస్తే తెలంగాణ ఏకంగా 19 అవార్డులు సాధించింది. కేసీఆర్ నాయకత్వంలో పనిచేసిన సర్పంచులు దేశంలో ఎక్కడా లేని విధంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికీ నల్లా కనెక్షన్ ఇచ్చారు. హరితహారం ఒక విప్లవం లాగా సాగింది. ప్రతి పల్లెలో తడి, పొడి చెత్తకు ట్రాక్టర్ కొనుగోలు చేసినం. చెత్తను వేరు చేసేందుకు డంపింగ్ యార్డ్ నిర్మించాం. ప్రతి గ్రామంలో వైకుంఠ ద్వారాలు నిర్మించాం. ప్రతి పల్లెలో ప్రకృతి వనాలు నిర్వహించాం.**



రెవెన్యూ గ్రామ పంచాయతీల్లో రైతు వేదికలు, గ్రామ పంచాయతీ భవనాలు నిర్మించాం. మన ఊరు–మన బడి కార్యక్రమాలు చేపట్టాం. అలాగే, ప్రతి పల్లెలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు, సీసీరోడ్లు, ఎల్ఈడీ లైట్లు ఏర్పాటు చేశాం. 30 రోజుల ప్రణాళిక ద్వారా చెత్తాచెదారం తొలగించి గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు యజ్ఞంలా పనిచేశాం. 2019 నుంచి 24 వరకు మహాత్మాగాంధీ ఉపాధిహామీ పథకం ద్వారా సీసీరోడ్లు, భవనాలు నిర్మించాం. అయితే, ఇప్పుడు నిధుల విడుదలలో జాప్యం వల్ల ఇబ్బందులు పడుతున్నాం.

అప్పట్లో కరోనా వైరస్ కారణంగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు బాగాలేక ప్రతినెల గ్రామ పంచాయతీలకు ఇవ్వాల్సిన నిధుల్లో జాప్యం జరిగింది. దీంతో అప్పట్లో ప్రతిపక్ష పార్టీగా ఉన్న కాంగ్రెస్... సర్పంచుల వైపు ఉన్నట్టు నమ్మించి, మాయమాటలు చెప్పి ఇందిరాపార్క్ వద్ద సర్పంచ్‌లతో ధర్నా చేయించింది. అప్పుడు పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న రేవంత్ రెడ్డి మా వైపున మాట్లాడారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చాక బిల్లులపై ఆయనకు వినతిపత్రం ఇస్తే కనీసం స్పందించలేదు. ఇప్పటికి మూడుసార్లు వినతిపత్రం అందించాం. ప్రజాభవన్‌లో ప్రజావాణి కార్యక్రమంలో బిల్లుల గురించి దరఖాస్తు చేసుకోవాలని చెప్తే అక్కడా చేసుకున్నాం. దరఖాస్తు చేసి మూడు నెలలైనా స్పందనలేదు. ఎమ్మెల్యేల నుంచి మంత్రుల వరకు అందరికీ మా సమస్యను చెప్పి బిల్లులు విడుదల చేయాలని అడిగితే రేపు, మాపు అంటూ దాటవేస్తున్నారు. ఎంపీడీవోలు మొదలు కలెక్టర్లు, పంచాయతీరాజ్ కమిషనర్‌కు, ప్రిన్సిపల్ సెక్రటరీకి బిల్లుల కోసం మొరపెట్టుకున్నాం. అడిగినప్పుడల్లా నెల రోజులు అంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన ఆరు నెలల తర్వాత బిల్లుల కోసం సీఎంను కలిసినా స్పందించలేదు. ఇక లాభం లేదని 3 వేల మంది సర్పంచులతో కలిసి సర్పంచ్‌ల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీగా ఏర్పాటై 'చలో హైదరాబాద్' నిర్వహించి హైదరాబాద్ గన్‌పార్క్ అమరవీరుల స్తూపం వద్ద నిరసన తెలిపాం. తెచ్చిన డబ్బులకు అప్పులు పెరిగిపోతున్నాయి.

**ప్రభుత్వానికి విన్నవించినా స్పందన లేకపోవడంతో పార్లమెంటు ఎన్నికల బరిలో దిగాలని నిర్ణయిస్తే సీతక్క అడ్డుకున్నారు. త్వరలోనే బిల్లులు చెల్లిస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికి 9 నెలలు గడిచాయి. బిల్లులు రాకపోవడంతో నిర్మల్ జిల్లాకు చెందిన సర్పంచ్ ఆత్మహత్య చేసుకున్నాడు. మహబూబాబాద్ సర్పంచ్ భర్త అప్పుల బాధతో మరణించాడు. యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన సాలా శంకర్ నాయక్ వైద్యానికి డబ్బుల్లేక మరణించినా ప్రభుత్వం పట్టించుకోలేదు. డిసెంబర్ లోపు పంచాయతీలకు బిల్లులు చెల్లిస్తామని మంత్రి పొన్నం చెప్పినా ఇప్పటి వరకు విడుదల కాలేదు.**

మా సమస్యలు పరిష్కారం కాకుంటే గాంధీ మార్గంలో 'చలో సెక్రటేరియట్' నిర్వహించి శాంతియుతంగా నిరసన తెలుపుతామని పిలుపునిస్తే అర్ధరాత్రి అక్రమ అరెస్టులు చేశారు. సర్పంచులను ఇండ్ల దగ్గర అరెస్ట్ చేసి హైదరాబాద్ రాకుండా అడ్డుకున్నారు. ఇంకెన్నాళ్లు మాకీ గోస? గ్రామ పంచాయతీలకు నిధులు ఇవ్వకుండా, అభివృద్ధి పనులను అడ్డుకోవడం సీఎంకు సరికాదు. మేం చేసిన అభివృద్ధి పనుల బిల్లులు వెంటనే చెల్లించాలి. లేదంటే ప్రభుత్వాన్ని అడుగడుగునా అడ్డుకుంటాం. మా పదవీకాలం అయిపోయి 13 నెలలు అవుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. అప్పులు భరించలేక సర్పంచ్ కుటుంబాలు ఛిన్నాభిన్నం అవుతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం చొరవ చూపి పెండింగ్ బిల్లులు ఇప్పించాలని వేడుకుంటున్నాం.



సుర్వి యాదయ్య గౌడ్
తెలంగాణ సర్పంచుల సంఘం జేఏసీ అధ్యక్షుడు

---



## అన్ని భాషలకు సమాన హోదా

**హిందీని మాత్రమే కాకుండా జాతీయ విద్యావిధానం ద్వారా మరేవో రుద్దుతారన్నదే తమిళ నాడు భయం. మనది భాషా సమాజం. రాజ్యాంగం కూడా 22 భాషలను గుర్తిస్తుంది. వీటిని జాతీయ భాషలుగా పరిగణిస్తారు. అన్ని భాషలకు సమాన హోదా ఉన్నది..**

– ప్రకాశ్ కరత్, సీపీఎం నేత

